# నాదితప్పే

"టెలిగ్రాం సార్."

తలుపుమూసి స్కూలుకు వెళ్ళబోతున్న నేను ఉలిక్కిపడ్డాను.

"మురళీధర్ ఎవరండీ"

నేనేనంటూ టెలిగ్రాం తీసుకొన్నాను. నాన్నగారికి ఒంట్లో బాగులేదట, వెంటనే రమ్మని ఎర్రటి కాగితంపై నల్లటి అక్షరాల సందేశం. నేనింటికి వెళ్ళి మూడేళ్ళయింది. ఎన్ని ఉత్తరాలొచ్చినా నేను భీష్మించుకు కూర్చున్నాను, కాని ఇప్పుడు....ఇప్పుడు వెళ్ళక తప్పదు.

ఆఫీసులో సెలవు దరఖాస్తు ఇచ్చి, హెడ్మాష్టరుతో మాట్లాడి స్టాఫ్ గదివేపు నడిచాను. సుజాత ఒక్కతీ కాంపోజేషన్ పుస్తకాలు దిద్దుకొంటోంది.

"సుజీ నాన్నగారికి, ఒంట్లో బాగులేదట టెలిగ్రాం వచ్చింది."

"అరరె" చేస్తున్న పని ఆపేసి వివరాలు చెప్పమన్నట్టు చూసింది.

"ఇందాకే వచ్చింది. సెలవు పెట్టాను, వెళ్ళక తప్పదు.

"వెళ్ళండి. ఈలాంటి సమయంలో పట్టుదలలు పనికిరావు."

"పట్టుదలలుకోసం ఇన్నాళ్ళూ ఇంటికి వెళ్ళలేదా ? నిజంగా నీకు కారణం తెలీదా సుజీ?"

తెలుసు నన్నట్టు తలవొంచి మెత్తగా నవ్వింది.

"ఒక పక్కని జబ్బుతో నాన్నగారు బాధపడుతూ మీకు పెళ్ళి సంబంధాలు చూస్తారనే భయం లేదు లెండి"

"ఆ ధైర్యంతోనే వెళ్తున్నాను సుజీ! క్రొత్త ఉద్యోగం వచ్చినా రాకపోయినా వచ్చే నెలలో మన పెళ్ళి ఖాయం మీ అమ్మగారికి చెప్పు నేను నీ కన్యాయంచేయనని."

సుజాత కళ్ళలో మెరుపు మెరిసింది. తన చేతిని నొక్కివచ్చే శాను.

* * *

మా వూళ్ళో అడుగు పెట్టేసరికే చీకటిపడింది. ఏవార్త వినవలసి వస్తుందోనని భయాందోళనతో ఇల్లుచేరాను.

ఆరుబయట మంచంమీద కూర్చుని పని వాళ్ళకేదో పురమాయిస్తున్నది. మానాన్నగారే! నన్ను చూడగానే "వచ్చావా" అంటూ మీసాలచాటునుండి గంభీరంగా నవ్వారు. అప్పుడు తిరుగు బస్సు లేదని నాకు తెలుసు. లేకపోతే ఆ పళాన వెనుదిరిగేవాడిని.

మీ ఒంట్లో ఏలావుంది? అన్నాను వ్యగ్యంగా, బాగానేవుంది. అయినా పుట్టిన వూరు ఒకటివుందనే మరిచిపోయినట్లున్నావే! టెలిగ్రాం ఎందుకు ఇచ్చారు?

అమ్మవచ్చింది. "లోపలికిరా మురళీ. తర్వాత మాట్లాడుకుందురు గాని"

స్నానంచేసి భోజనానికి కూర్చున్నాను. "ఇప్పుడెందుకు పిలిపించినట్టమ్మా" మూడేళ్ళయి మేము బ్రతికున్నామో లేదో కనుక్కున్నావట్రా. నీకు లేకపోయినా మాకుండదూ మమకారం?

"కేవలం నామీద ప్రేమతో పిలిపించామంటారు!"

ఇంతలో నాన్నగారు వచ్చారు "మురళీ ఎన్నాళ్ళు సెలవు పెట్టావు?"

"రేపే వెళ్తానండి. ఇంట్లో అందరికీ కులాసాగానే వుందిగా."

"నిన్ను పిలిపించిన కారణమదికాదు. మామయ్య కూతురి పెళ్ళికి తొందరపడుతుంటే మొన్న ముహూర్తం పెట్టించాం. వచ్చే గురువారమే పెళ్ళి."

"ఆ విషయం వ్రాయొచ్చుగా, వరుడేం చేస్తున్నాడు? ఈ వూరేనా."

"మరీ తెలీనట్లు మాటాడకురా, ఇంతటి బావవు నీవుండగా పరాయివాణ్ణి వెతుక్కునే కర్మ దానికేం పట్టింది!"

చేతిలోని ముద్ద జారిపోయింది. "నా పెళ్ళి ...నా ప్రమేయం లేకుండా ఎలా నిర్ణయిస్తారు?" చేయి కడిగేసుకున్నాను.

గబ గబ బట్టలు మార్చుకుంటుంటే గదిలోకి వచ్చారు నాన్నగారు. "వాళ్ళింటికి ఇప్పుడు వెళ్ళి ఏ రభసాచెయ్యకు. ఆరు నూరయినా ఈ

పెళ్ళి జరిగితీరుతుంది. ముహూర్తం పెట్టుకొని వెనక్కి తగ్గటంమనేది మా వంశంలో లేదు."

నాన్నగారు ఆ ఊరికి పెద్ద రైతుల్లో పెద్ద. తన మాటకు తిరుగుండదు. కానీ ఆ పలుకుబడి నా జీవితాన్నే నాశనం చేస్తుంటే ఎలా సహిస్తాను?

వెళ్ళబోతున్న నన్ను అమ్మ పిలిచింది. "మురళీ ఇది కాని పనేం కాదు. అందరూ నీ మేలు కోరే వాళ్లే, ఇప్పుడు ఏం గొడవ జరిగినా అబాసుపాలవక తప్పదు. శారద చాలా మంచిపిల్ల, నీకు నచ్చిన రీతిని దిద్దుకోవచ్చు. పెళ్లి నిశ్చయ మయ్యాక తప్పించావంటే ఆడపిల్ల దాని బ్రతుకేంగాను! దాని మొహం చూసైనా వూరుకో తండ్రీ!" "అందరూ నయ వంచకులే" అంటూ ఇవతల బడ్డాను.

మామయ్యగారిల్లు హడావుడిగా వుంది. పెళ్లి పనులతో నన్ను చూడగానే అందరూ చిరునవ్వుతో పరిహాసంతో స్వాగతం చెప్పారు. ముబావంగా మాట్లాడి "శారద ఏదీ" అని అడిగాను

"వెనక తోటలో వుందేమో! పిలువనా"

అంది అత్తయ్య

నేనే వెళ్లాను, ఇంటి వెనక పెద్ద పెరడు అరటిచెట్టూ, మల్లె చెట్టూ అన్నీవున్నాయి. మచంమీద కూర్చుని మల్లెదండ గుచ్చుతోంది. శారద ఏదో సన్నగా పాడుకుంటూ నన్ను చూడగానే లేచి నిల్చుంది. ఒడిలోని మల్లెలన్నీ నేల పాలయ్యాయి.

"శారదా ఈ పెళ్ళికి నీవు వొప్పుకున్నావా," నా ప్రశ్న విని తెల్లబోయింది.

"అలా వూరకుంటే లాభంలేదు. నాకు తెలీకుండా నిశ్చయం చేశారు. ఇప్పుడైనా మించిపోయిందేమీలేదు. అదే ముహూర్తానికి నీకు తగిన వరుణ్ణి వెతికి తెచ్చే పూచీనాది" తన చేతిలోని దండ జారి నాకాళ్ళ దగ్గరగా పడింది. కన్నీళ్ళు జలజలా రాలాయి. "ఇటువంటి అప్రాచ్యపు మాటలు మాటాడకు బావా. ఈ పెళ్ళి ఆగిపోవాలనే నీ కోరికయితే

చెప్పు? ఎవరికీ తెలియకుండా వురిబోసుకుంటాను అంతేగాని.... నేను నీ దాన్ని. పరాయి వాళ్ళ కివ్వటం కన్నా నీచేతులతో గొంతునులిమినా మంచిదే!

ఆమె మాటలు తేలిగ్గా తీసివేసేలా లేవు. ఆమె కళ్ళల్లోని నిశ్చ యానికి నేను చలించాను. నిశ్శబ్దంగా వెనక్కి తిరిగాను. బుర్ర వేడెక్కి పోతోంది. ఇల్లు చేరగానే అమ్మ వెన్నెట్లో పక్క వేసింది. ఎవరితో ఏమీ మాటాడకుండా పడుకున్నాను.

మరుసటిరోజు నుండి విపరీతమయిన జర్వం వచ్చింది. నేను పారి పోకుండా నాన్నగారు పగడ్బందీ చేశారు. పెళ్ళి తంతు ఏలా ముగిసిందో నేను గ్రహించేలోపే శారద నా సతీమణి అయింది.

స్కూలుకు తిరిగి వెళ్లినా సుజాతకు నా మొహం ఏలా చూపిం చాలో అర్థం కాలేదు. నేనెంత పశ్చాత్తాపంతో కృంగిపోతే మాత్రం తనకు కలిగిన కష్టము తీరుతుందా! "తప్పు జరిగిపోయింది. సుజా నీకు ఇష్టము వచ్చిన శిక్ష విధించు" అన్నాను. "శిక్షించటానికి నేనెవరిని? అంతా నా దురదృష్టం కనీసం ఆవిడనయినా ఆదరంగా చూసుకోండి" అంది. తనుకోపగించినా నాకు కొంచం ఉపశమనం కలిగేదేమో! త్వర లోనే సుజాత తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వెళ్లింది.

* * *

పదేళ్లు గడిచాయి నేను హయ్యరు సెకండరీ స్కూలుకు హెడ్మా స్టరు గిరిచేస్తున్నాను. శారదతో నా జీవితము సాఫీగానే జరిగిపోతోంది. కాని.... సుజాతను నమ్మించి మోసం చేశాననే బాధనన్ను పీడిస్తూనే వుంది శారదకు ఓసారి సుజాత విషయం చెబితే "పాపం" అంది. సానుభూతి కాక సుజాతకు జీవితంలో మిగిలిందేమిటి?

ఆ సాయంకాలము నా స్కూటరు చప్పుడు వినగానే మా "సుజీ" "నాన్నగారూ" అంటూ పరుగెత్తుకుంటూ వచ్చింది. నా చేయిపట్టుకు లాక్కెళుతూ "నాన్నగారూ ఈ రోజు కారు క్రింద పడబోయానండీ అంటీ నన్ను ప్రక్కకు లాగేసింది" అంది. భయంగా కళ్ళు పెద్దవిచేసి.

"నా వెర్రితల్లి భయమేసిందా?" అన్నాను పాపను ఎత్తుకుంటూ.

"అవును నాన్నగారూ కానీ పాపం ఆంటీకి దెబ్బతగిలింది. కుంటుతోంది"

"ఎవరమ్మా ఆంటీ" అంటూ హాల్లోకి అడుగు పెట్టాను.

సోఫాలో కూర్చున వ్యక్తి వెనక్కు చూసింది. ఆమెకళ్ళు కళకళ లాడాయి. "మీరా....మీరా" అంది అస్పష్టంగా.

"సుజా నీవిక్కడ.... ఇదెలా సాధ్యం అన్నాను" తొట్రుపడుతూ.

తను లేచినిల్చుంది.

"ఎక్కడుంటున్నావు?"

"ఉండటాకిచోటేదీ" అని నిర్లిప్తంగా నవ్వి వెళ్ళిపోయింది కొద్దిగా కుంటుతూ.

నేను ట్రమాన్పడి నిలబడ్డాను.